## క్లుప్తంగా

### సర్పంచులకు ప్రశంసా పత్రాల అందజేత



సర్పంచ్ మునేనాయక్‌కు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎంపీపీ వైవీ కౌసల్య

**తనకల్లు:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పలువురు సర్పంచులకు ఎంపీపీ వైవీ కౌసల్య చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పూల నరసింహులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించిన 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ఉత్తమ ప్రతిభ చూపిన సర్పంచులను ప్రశంసా పత్రాలతో సత్కరించినట్లు తెలిపారు. అలాగే బొంతలపల్లి గ్రామ సర్పంచ్ పూల లత జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందకోవడం హర్షించదగిన విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఆనందయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

### 'ఎవరికీ డబ్బులివ్వొద్దు'

**ఓడీ చెరువు:** హౌసింగ్ లబ్ధిదారులు ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వద్దని ఎంపీడీఓ పోలప్ప, హౌసింగ్ ఏఈ హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. అధికారులు, వలంటీర్లు, మధ్యవర్తులైనా హౌసింగ్ లేదా సిమెంట్ కోసం డబ్బులడిగితే 9440087827, 7090931493, 9989462178 కాల్ చేసి తెలియచేయాలన్నారు. వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు.

### తూకాల పరిశీలన



తూకాలను సరిచూస్తున్న అధికారులు

**బత్తలపల్లి:** మండలంలోని చౌకధాన్యపు డిపోల్లో తూకాలను తూనికలు, కొలతల అధికారులు సోమవారం సరి చూశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కొలతలు, సీలు సరిచూడటం, కొత్త సీలు వేయడం జరుగుతోందన్నారు. ప్రజలకు మోసం జరగకూడదనే తనిఖీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ యుగేశ్వరిదేవి, సీఎస్ డీటీ శారద, డిప్యూటీ తహసీల్దార్ హరిప్రసాద్, పలువురు డీలర్లు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

**ఎన్‌పీకుంట:** మండల పరిధిలోని తిమ్మమ్మమర్రిమాను అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం హిందూపురం జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్‌కుమార్ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఎంపీహెచ్‌ఈలు లక్ష్మీనారాయణ, రాఘవేంద్ర, ఏఎన్ఎం నిరీష, తదితరులు పాల్గొన్నారు.

### తక్కువ ప్రీమియంతో బీమా



అవగాహన కల్పిస్తున్న మేనేజర్ పిచ్చయ్య

**ఎన్‌పీకుంట:** అతి తక్కువ ప్రీమియంతో జీవిత, ప్రమాద బీమా సదుపాయాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోందని స్థానిక ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ పిచ్చయ్య తెలిపారు. సోమవారం గోవిందురాజులపల్లి గ్రామంలో ఉపాధిహామీ కూలీలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సంవత్సరానికి రూ.436 చెల్లిస్తే రూ.2లక్షల జీవిత బీమా, రూ.20 చెల్లిస్తే పీఎంఎస్‌బీవై కింద రూ.2 లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ వీరమారుతి, తదితరులున్నారు.

### సచివాలయాల స్థల మార్పు

**పుట్టపర్తి:** బుక్కపట్నం మండలం కొత్తకోట గ్రామ సచివాలయంలో ఉన్న నార్సింపల్లి తండా పంచాయతీని బుక్కపట్నం-3 సచివాలయానికి, అగ్రహారం సచివాలయంలో ఉన్న రాశింపల్లిని గూనిపల్లికి, నల్లమాడ మండలం గోపేపల్లి సచివాలయంలో ఉన్న మసకవంకపల్లి పంచాయతీని కురుమాల సచివాలయానికి, ఇదే మండలం యర్రవంకపల్లి సచివాలయంలో ఉన్న వేళ్లమద్ది, కొత్తపల్లి తండాలను వేళ్లమద్ది సచివాలయానికి మార్పు చేశారు. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సచివాలయాల సేవలు ప్రజలకు మరింత చేరువవుతాయని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు.

### అర్జీలకు పరిష్కారం చూపాలి

**పుట్టపర్తి:** స్పందనలో వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. ఆయన సోమవారం బుక్కపట్నం తహసీల్దార్ కార్యాలయంలో కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# సొంతింటి కల సాకారం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

**ధర్మవరం:** పేద వారి సొంతింటి కల సాకారం చేశామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక 36వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వర్షపు, మురుగు నీరు ఇళ్ల ముందు చేరుతోందని, ఫలితంగా దుర్గంధం వెదజల్లుతోందని ఎమ్మెల్యేకు తెలిపారు. ఆయన స్పందిస్తూ లోతట్టు ప్రాంతంలో డ్రైన్‌లకు సమానంగా రోడ్డు వేసి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను ఆదేశించారు. వార్డులో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. త్వరితగతిన కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ధర్మవరం పట్టణంలో 11 వేల మందికి పైగా ఇంటిపట్టాలను మంజూరు చేసి సొంతింటి కల సాకారం చేశామన్నారు. అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, నేతన్న నేస్తం పథకాల ద్వారా ఇతోధిక లబ్ధి చేకూర్చామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు ఎర్రగుంట భాగ్యలక్ష్మి, పెణుజూరు నాగరాజు, వార్డు కౌన్సిలర్ చింతా యల్లయ్య, పట్టణ సచివాలయాల కన్వీనర్‌లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, నాయకులు శంకర నారాయణస్వామి, బాష, అంజి, రామకృష్ణ, కబీర్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

**ఆస్పత్రి పరిశీలన**

**ధర్మవరం అర్బన్:** ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిని సోమవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ విభాగం, జనరల్ వార్డు, గర్భిణులు, బాలింతల వార్డును పరిశీలించి రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొంత మంది వృద్ధులకు ఆర్థికసాయం అందించారు. అనంతరం ఆసుపత్రిలోని మందుల గదిని పరిశీలించి ఎంతమేర మందులు స్టాకు ఉన్నాయి, రోజూ వచ్చే రోగుల సంఖ్య ఎంత, వారికి మందులు సరిపోతున్నాయా, అడ్మిట్ అవుతున్న రోగులు ఎంత మంది, వారికి సరైన వైద్యం అందిస్తున్నారా అని సూపరింటెండెంట్ పద్మలతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులు, సిబ్బంది హాజరుపట్టికను పరిశీలించారు. రోగులకు సరైన వైద్యం అందించాలని ఆదేశించారు.

# జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి



ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

**నల్లచెరువు:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండలంలోని ఓరువాయి సచివాలయం పరిధిలోని మారిశెట్టి పల్లి, చెరువు వాండ్ల పల్లి గ్రామాలలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికీ ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. బుక్‌లెట్లు అందజేశారు. చెరువువాండ్లపల్లిలో పలువురు సిమెంట్ రోడ్డు వేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సంబంధిత ఇంజినీరింగ్ అసిస్టెంట్‌తో మాట్లాడి ఎస్టిమేట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. పొజిషన్‌లో ఉన్న వారికి పట్టాలు ఇప్పించాలని కోరగా, తహసీల్దార్ మధునాయక్‌తో మాట్లాడి అర్హత కలిగిన వారికి పట్టాలిచ్చే విధంగా చూడాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. టీడీపీ హయాంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు, జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను రాబందుల్లా పీక్కు తిన్నారని గుర్తు చేశారు. జగనన్న ప్రభుత్వం ఏర్పడగానే అవినీతికి, లంచాలకు తావు లేకుండా గ్రామ వార్డు సచివాలయాల ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ జోనల్ ఇన్‌చార్జ్ కె.రమణారెడ్డి, ఎంపీడీఓ శకుంతల, వైస్ ఎంపీపీలు నారాయణస్వామి, రామలక్ష్మమ్మ, సర్పంచులు గంగాదేవి, శ్రీనాథ్‌రెడ్డి, యూసుఫ్, సింగల్ విండో అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నాగభూషణ, ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, నరసింహారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్, టెంపుల్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ చైర్మన్ ఆనంద్‌రెడ్డి, నాయకులు డాక్టర్ శంకర్, నరసింహారెడ్డి, బయారెడ్డి, బట్టీ హైదర్‌వలి, పీఆర్.శంకర, తదితరులు పాల్గొన్నారు.

**సీఎం జగన్‌పై పెరిగిన విశ్వాసం**

**కదిరి టౌన్:** సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఏప్రిల్ 7 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'జగనన్నే మా భవిష్యత్' మెగా పీపుల్స్ సర్వే ప్రారంభించామన్నారు. 7 లక్షల మంది జగనన్న సైనికులు ప్రతి ఇంటినీ సందర్శించారన్నారు. సీఎం జగన్ పాలనకు మద్దతుగా 79 లక్షలకు పైగా ప్రజలు తమ మొబైల్ నుంచి మిస్డ్ కాల్స్ ఇచ్చారన్నారు. 1.65 కోట్ల కుటుంబాలను సందర్శించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ నాయకులు పనిచేస్తున్నారన్నారు. ఈ స్పందన చూసి ప్రతిపక్షాలు ఉలిక్కిపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ లింగాల మధుసూదన్‌రెడ్డి, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రణీత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు తవళం ఆంజనేయస్వామి రథోత్సవం



ఆలయంలో రథాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం

**తనకల్లు:** మండల పరిధిలోని తవళం గ్రామంలో నేడు (మంగళవారం) ఆంజనేయస్వామి రథోత్సవం కనుల పండువగా జరగనుంది. తవళంలో ఎద్దుల పరుష సందర్భంగా ప్రతి ఏటా ఇక్కడ వెలసిన ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలను నాలుగు రోజుల పాటు ఘనంగా జరపడం ఆచారం. అందులో భాగంగా మంగళవారం ఉదయం 9:30 గంటలకు రథోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. రథోత్సవానికి తగిన ఏర్పాట్లను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చేస్తున్నారు. స్వాముల వారు ఆసీనులయ్యే రథాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. వేడుకను తిలకించడానికి మండలం నుండే కాకుండా పొరుగున ఉన్న అన్నమయ్య జిల్లా మొలకలచెరువు, బీ. కొత్తకోట, పీటీఎం మండలాలతో పాటు కర్ణాటకలోని చాకివేలు, చేలూరు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు.

## పైప్‌లైన్ ఏర్పాటు

**నల్లమాడ:** ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని యర్రవంకపల్లి పంచాయతీ కేంద్రంలో సోమవారం నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. జల జీవన్ మిషన్ కింద ఎస్టీ వసతిగృహం, గ్రామ సచివాలయం, హెల్త్ సెంటర్, జగనన్న కాలనీకి సత్యసాయి తాగునీటి సరఫరాకు వీలుగా జేసీబీ యంత్రంతో గుంతలు తవ్వి, పైప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి త్రివేణి, సచివాలయ కార్యదర్శి సందీప్‌గౌడ్ పాల్గొన్నారు.

## చేతిరాత పోటీల్లో సత్తా

**ఓడీ చెరువు:** ఆల్ ఇండియా గ్రాఫాలజీ అసోసియేషన్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన జాతీయస్థాయి క్యాలీగ్రఫీ (చేతిరాత) పోటీలో స్థానిక వశిష్ట ఇంగ్లిష్ మీడియం 10వ తరగతి విద్యార్థి బి.నాగవేణి సత్తా చాటింది. జాతీయస్థాయిలో 3వ ర్యాంక్ సాధించింది. సోమవారం విజయవాడలో కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థినికి అవార్డు, ప్రశంసా పత్రం అందజేసినట్లు కరస్పాండెంట్ పిట్టా శివశంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జయసింహారెడ్డి తెలిపారు. శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు చిన గంగప్పకు ప్రత్యేక అభినందనలు తెలియచేశారు.

## అన్నదానం

**ప్రశాంతి నిలయం:** సత్యసాయి ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని పుట్టపర్తికి వచ్చే భక్తుల ఆకలిదప్పులు తీర్చేందుకు పట్టణానికి చెందిన పలువురు భక్తులు సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయి సూర్య హోటల్ వద్ద కౌన్సిలర్ సూర్యగౌడ్ ఆధ్వర్యంలో, హనుమాన్ సర్కిల్‌లో పట్టణ కార్పెంటర్స్ అసోసియేషన్, సూపర్ బజార్ ఎదురుగా సత్యసాయి భక్తులు, గోకులంలో సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కౌన్సిలర్ సాయి గీత భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. పుట్టపర్తి పరిసర గ్రామాల్లో సైతం ఆయా గ్రామాల సత్యసాయి భక్తులు అన్నదానం చేశారు.

## ప్రజా సమస్యలపై దృష్టి

**బత్తలపల్లి:** స్పందనలో ప్రజల నుంచి అందే సమస్యలపై దృష్టి సారించాలని తహసీల్దార్ యుగేశ్వరిదేవి పేర్కొన్నారు. స్పందన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ సచివాలయాల్లో నిర్వహించారు. ఇందులో ఎనిమిది అర్జీలు అందినట్లు తెలిపారు. భూ సమస్యలపై ఆరు అర్జీలు, రెండు అర్జీలు రస్తా సమస్యపై అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీదేవి, ఏపీఓ ఆదెప్ప, ఏపీఎం సుదర్శన్‌రాజు, ఇంజినీర్ రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మీ, ఏఓ ఓబిరెడ్డి, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ శివయ్య, ఇతర అధికారులు హాజరయ్యారు.

**రీ సర్వే, భూ పంపిణీపైన ప్రత్యేక దృష్టి**

మండలంలో జరుగుతున్న రీ సర్వే, భూ పంపిణీ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ యుగేశ్వరిదేవి వీఆర్‌ఓలకు సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె వీఆర్‌ఓలతో సమావేశం ఏర్పాటు చేశారు. విమర్శలకు తావులేకుండా జాబితా తయారు చేయాలన్నారు. డి.చెర్లోపల్లి రెవెన్యూ విలేజ్‌లో అవకతవకలు లేకుండా అర్హులకు మాత్రమే పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. తప్పుడు కథనాలు రాయవద్దని సూచించారు. బోగస్ పాసు పుస్తకాలు కలిగిన రైతులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

## ఏఆర్ అడ్మిన్‌పై ఎస్పీ ఆగ్రహం

**కొత్తచెరువు:** 'స్పందన'లో సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఏఆర్ అడ్మిన్ ఆర్‌ఐ టైటాస్‌పై ఎస్పీ మాధవరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు కూర్చునే ప్రాంతంలో టేబుల్స్ ఏర్పాటు సక్రమంగా లేకపోవడంతో ఆయన ఫైర్ అయ్యారు. విధులు నిర్వర్తించేది ఇలాగేనా అంటూ నిలదీయడంతో అక్కడున్న పోలీసు అధికారులు వెంటనే స్పందించి టేబుళ్లను సౌకర్యవంతంగా మార్చారు.

## ఎంఈఓకు సన్మానం

**ముదిగుబ్బ:** ముదిగుబ్బ ఎమ్మార్సీలో సోమవారం డీఎస్సీ-98 బ్యాచ్‌కు చెందిన ఉపాధ్యాయులు ఎంఈఓ సుధాకర్ నాయక్‌ను ఘనంగా సన్మానించారు. 10 మంది ఉపాధ్యాయులు మండలంలోని పలు పాఠశాలల్లో బాధ్యతలు చేపట్టారు. వీరంతా కలిసి ఎంఈఓను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఎంఈఓ మాట్లాడుతూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## బూత్ లెవల్ కన్వీనర్ల నియామకం

**పుట్టపర్తి:** ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఓడీ చెరువు మండల బూత్ లెవల్ కన్వీనర్, కో-కన్వీనర్లను నియమించారు. మండల బూత్ లెవల్ కన్వీనర్‌గా గోవర్ధన్‌రెడ్డి, కో-కన్వీనర్లుగా రామమోహన్, మధుసూదన్ నియమితులయ్యారు.



గోవర్ధన్‌రెడ్డి, రామమోహన్ , మధుసూదన్

## మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం

- వామపక్ష పార్టీల నాయకుల పిలుపు

**కనగానపల్లి:** కేంద్రంలో ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహదేవ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం నాయకులు కేంద్ర ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించారు. ఈ నెల 30 వరకు మోదీ హటావో.. దేశ్ బచావో కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్నామన్నారు. ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బాలరాజు, పలువురు సీపీఐ, సీపీఎం, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం వారు తహసీల్దార్ కార్యాలయంలోని స్పందనలో ఉపాధి హామీ పనుల పెండింగ్ బిల్లులు ఇవ్వాలని విన్నవించారు.

# ఘనంగా పంచాయతీ రాజ్ దినోత్సవం





కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకుంటున్న సర్పంచులు శ్రీలత, శారదమ్మ



కనగానపల్లి: ప్రశంసాపత్రాలతో సర్పంచ్‌లు

**తాడిమర్రి:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మీ, పెద్దకోట్ల సర్పంచ్ వెంకటవరద, వైఎస్సార్ సీపీ నాయకులు మారక శివారెడ్డి, పాటిల్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**తలుపుల:** మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఎంపీపీ రఫినాయక్, ఎంపీడీఓ రామానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు.పంచాయతీ కార్యాలయంలో ఉపసర్పంచ్ డికె బాబు ఆధ్వర్యంలో దినోత్సవం నిర్వహించారు. మాజీ సర్పంచ్ పయాజ్ అహమ్మద్, ఈఓపీఆర్డీ శకుంతల, వార్డుమెంబర్లు మౌలా, సుభహాన్, రమేష్ ఉన్నారు.

- పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా మేజర్ పంచాయతీ సర్పంచ్ శ్రీలత, ఈఓ మాధవరెడ్డికి అవార్డులను కలెక్టర్ పి.అరుణ్‌బాబు అందజేశారు.

**బత్తలపల్లి:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. 9 అంశాల్లో వృద్ధి సాధించిన గ్రామ పంచాయతీలకు ప్రశంసా పత్రం అందజేశారు. అంతకు ముందు జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ యుగేశ్వరిదేవి, ఎంపీడీఓ శ్రీదేవి, కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులున్నారు.

- అప్పరాచెరువుని ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేసి కలెక్టర్ అరుణ్‌బాబు అవార్డు, ప్రశంసా పత్రాన్ని సర్పంచు మొర్రెడ్డిగారి శారదమ్మ, కార్యదర్శి అలివేలుమంగమ్మకు అందజేశారు.

**నల్లచెరువు:** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ రాజ్ జోనల్ ఇన్‌చార్జ్ కె రమణారెడ్డి, ఎంపీడీఓ శకుంతల ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. రమణారెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో కలెక్టర్ అరుణ్ బాబు చేతుల మీదుగా తవళంమర్రి సర్పంచ్ ఆంజనమ్మ అవార్డు అందుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో సర్పంచులు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న సర్పంచ్ అలివేలమ్మ

**కొడవగానిపల్లి పంచాయతీకి 3 అవార్డులు**

**కొత్తచెరువు:** మండల పరిధిలోని కొడవగానిపల్లి గ్రామ పంచాయతీలో మెరుగైన సేవలు అందించినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి మండల స్థాయిలో మూడు అవార్డులు దక్కాయి. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సిద్దారెడ్డి చేతుల మీదుగా సర్పంచ్ అలివేలమ్మ, కార్యదర్శి గంగాధర్ రెడ్డి ప్రశంస పత్రాలు, అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాయత్రి, జెడ్పీటీసీ గంగాదేవి, తదితరులున్నారు.

**దేశానికి గ్రామాలే పట్టుగొమ్మలు**

**ఓడీ చెరువు:** దేశానికి గ్రామాలే పట్టుగొమ్మలని ఎంపీడీఓ పోలప్ప, ఎంపీపీ ఫర్వీన్‌బాను అన్నారు. ఓడీ చెరువు మండల కేంద్రంతో పాటు అన్ని పంచాయతీ కార్యాలయాల్లో సోమవారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దీపికారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయమ్మ, వైకేపీ ఏపీఎం రమణప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

**గొట్లూరు సర్పంచ్‌కు సన్మానం**

**ధర్మవరం రూరల్:** పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలో గొట్లూరు సర్పంచ్ పిట్టా నరసమ్మను కలెక్టర్ అరుణ్ బాబు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సహకారంతో పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దామన్నారు.

**స్థానిక సంస్థల్ని బలోపేతం చేయాలి**

**ఎన్‌పీకుంట:** స్థానిక సంస్థల్ని బలోపేతం చేస్తే క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కరించవచ్చని మండల ఎంపీపీ ఈటెరాము అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అధ్యక్షతన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం జరిపారు. మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండలంలో 6 పంచాయతీలకు 19 అవార్డులను ఆయా సర్పంచులు, కార్యదర్శులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆదినారాయణ, ఈఓఆర్డీ మనోహర్, సర్పంచులు, కార్యదర్శులు, ఉపసర్పంచులు పాల్గొన్నారు.

**వివిధ అంశాల్లో అవార్డులు..**

**గాండ్లపెంట:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ తాతం జగన్‌మోహన్ అధ్యక్షతన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. మెరుగైన జీవనోపాధుల గ్రామ పంచాయతీ కింద గొడ్డువెలగల, చామాలగొంది, టి.పెద్దతండా, పిల్లల స్నేహపూర్వక గ్రామ పంచాయతీ కింద గొడ్డువెలగల, మద్దివారిగొంది, వేపరాల, మహిళా స్నేహపూర్వక- మద్దివారిగొంది, తుమ్మలబైలు, టి.పెద్దతండా, సుపరిపాలన- జి.పెద్దతండా, కటారుపల్లి, సోమయాజులపల్లి, పరిశుభ్రమైన, హరిత పంచాయతీ- తుమ్మలబైలు, జీనులకుంట, మలమీదపల్లి, ఆరోగ్యకర పంచాయతీ- మద్దివారిగొంది,సోమయాజులపల్లి,గాండ్లపెంట, సామాజిక భద్రత- తూపల్లి, తుమ్మలబైలు, వేపరాల, స్వయం సమృద్ధిలో మౌలిక సదుపాయాలు- గాండ్లపెంట, ముదుపులజీవి,కురుమామిడి, నీటి సమృద్ధి- జి.పెద్దతండా, తూపల్లి, మద్దివారిగొందికి అవార్డులు అందించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సునీత తదితరులు పాల్గొన్నారు.

**కనగానపల్లిలో..**

**కనగానపల్లి:** స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆదర్శ పంచాయతీలకు ప్రకటించిన సర్పంచ్‌లు, కార్యదర్శులకు ప్రశంసా పత్రాలు అందించారు. సమావేశంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**రామగిరి:** మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీరాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ నారాయణస్వామి, ఎంపీడీఓ ఆజాద్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రెన్న, జెడ్పీటీసీ నాగార్జున, ఈఓఆర్డీ రాధాకృష్ణ, సుబహాన్, శర్మ,పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

**పుట్టపర్తి:** బుక్కపట్నం ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి,ఎంపీడీఓ శ్రీనివాసులు,సిబ్బంది ఘనంగా నిర్వహించారు. బుక్కపట్నం, బుచ్చయ్యగారిపల్లి, నార్సింపల్లితండా, సిద్దరాంపురం పంచాయతీలను ఉత్తమ పంచాయతీలుగా ప్రకటించింది. ఆయా గ్రామాల సర్పంచులు నాగలక్ష్మమ్మ,రూప,కృష్ణమ్మబాయి,రమణప్పలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, బట్టల కేశప్ప, భాస్కర్‌నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ కొళాయి

**ముదిగుబ్బ:** ప్రతి ఇంటికీ జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీటి కొళాయిని ఏర్పాటు చేయడం జరుగుతుందని జల్‌జీవన్ మిషన్ అధికారి నరసింహనాయక్ తెలిపారు. సోమవారం ముదిగుబ్బ మేజర్ పంచాయతీ కార్యాలయంలో పంచాయితీరాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ లక్ష్మీదేవి హాజరయ్యారు. కార్యక్రమంలో కార్యదర్శి మంజుల, జలజీవన్ మిషన్ సిబ్బంది మమతా, నవనీత తదితరులున్నారు.

## నివేశన స్థలాలు మంజూరు చేయండి

**ఎన్‌పీకుంట:** ఇళ్ల నిర్మించుకోవడానికి మండల కేంద్రంలో నివేశన స్థలాలు మంజూరు చేయించాలని అంబేడ్కర్‌నగర్‌వాసులు సోమవారం తహసీల్దార్ రవి నాయక్‌కు వినతి పత్రం అందించారు. ఆర్డీటీ వారు సుమారు 91 మంది కాలనీ వాసులకు ఇళ్లు నిర్మించి ఇవ్వడానికి ముందుకు వచ్చారని, భూమి గుర్తించి కేటాయించాలని కోరారు. సర్పంచ్ ఆంజినమ్మ, శ్రీరాములు తదితరులున్నారు.

## ఆర్‌అండ్‌బీ స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకోండి

**కనగానపల్లి:** తల్లిమడుగులలో ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన 'స్పందన'లో విన్నవించారు. అధికారులు విచారణ చేయించి ఆక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలన్నారు. రాష్ట్ర, జిల్లా కురుబ సంఘం నాయకులు రమేష్‌బాబు, శ్రీకాంత్, రాజశేఖర్, గ్రామస్తులు ఓబిలేసు, బండి కుమార్, నారాయణస్వామి, గురుమూర్తి, రామ్మోహన్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

**రస్తా సమస్య పరిష్కరించండి..**

కొండ్రెడ్డిబాయిలో పొలాల దగ్గరకు వెళ్లే రస్తా సమస్య పరిష్కరించాలని స్థానిక రైతులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే పొలాల దగ్గరకు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పవని స్థానిక రైతులు వెంకటరామిరెడ్డి, జయరాంరెడ్డి, శివారెడ్డి, నారాయణరెడ్డి, అశోక్ తెలిపారు.

## నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

**ముదిగుబ్బ:** మండలంలోని కొడవండ్లపల్లి సమీపంలో సోమవారం వీచిన పెనుగాలులకు 15 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు వెంటనే కరెంట్ సరఫరాను నిలిపి వేశారు. ఘటనతో రైతుల స్టార్టర్ పెట్టెలు ధ్వంసమైనట్లు సమాచారం.